## నామినేషన్లు షురూ..

- తొలి రోజు నలుగురు అభ్యర్థులు.. ఆరు సెట్లు దాఖలు

నల్లగొండ, ఏప్రిల్ 18 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గురువారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదలతోపాటు నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. నల్లగొండ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన వివిధ పార్టీల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అభ్యర్థితోపాటు నలుగురిని మాత్రమే నామినేషన్ వేసేందుకు అనుమతిచ్చారు. తొలి రోజు రిటైర్డ్ ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్ రెండు నామినేషన్లు దాఖలు చేయగా, బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి తరఫున ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్ ఒక సెట్ నామినేషన్ అందజేశారు. అలాగే సోషలిస్టు పార్టీ(ఇండియా) నుంచి రచ్చ సుభద్రారెడ్డి ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయగా, ప్రజావాణి పార్టీ నుంచి లింగిడి వెంకటేశ్వర్లు రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. సెలవు రోజులు మినహా ఈ నెల 25 వరకు నామినేషన్లు సమర్పించేందుకు అవకాశం ఉంది.



నామినేషన్ పత్రాలు అందిస్తున్న బీజేపీ నాయకులు



అడవిదేవులపల్లి మండలం చిట్యాల ఇన్‌టెక్‌వెల్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా, అడిషనల్ కలెక్టర్ పూర్ణచందర్‌రావు

# మరింత దూకుడుగా బీఆర్‌ఎస్..

నేటి నుంచి 6వరకు మండలాల్లో ర్యాలీలు, రోడ్‌షోలు

- ఒక్కరోజు మూడు మండలాలు కవర్ చేసేలా షెడ్యూల్
- ముఖ్య అతిథిగా హాజరుకానున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, అభ్యర్థి క్యామ మల్లేశ్
- నేడు అర్వపల్లిలో ఎన్నికల ప్రచారం ప్రారంభం
- ఇప్పటికే సన్నాహక సమావేశాల సక్సెస్‌తో కేడర్‌లో ఫుల్ జోష్
- బీ ఫామ్ అందుకున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్



బీఆర్‌ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌కు బీ ఫారమ్ అందిస్తున్న ఆ పార్టీ అధినేత కేసీఆర్, చిత్రంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ నేతలు

యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ పార్టీ మరింత దూకుడుగా దూసుకెళ్తున్నది. ఇప్పటికే ప్రచారంలో జాతీయ పార్టీలకు అందనంత దూరంలో ఉన్న గులాబీ పార్టీ మరింత జోరు పెంచనుంది. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. భువనగిరి పార్లమెంట్‌కు సంబంధించి రూట్‌మ్యాప్ సిద్ధం చేసింది. రోజుకు మూడు మండలాలను కవర్ చేసేలా షెడ్యూల్ ఖరారు చేసింది. శుక్రవారం నుంచి వచ్చే నెల 6వరకు భారీ ఎత్తున ప్రచార కార్యక్రమాలు చేపట్టనుంది.

### షెడ్యూల్ ఇలా..

ఎన్నికల కమిషన్ ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసింది. నాలుగో విడుత ఎన్నికల్లో భాగంగా గురువారం భువనగిరి పార్లమెంట్‌కు నోటిఫికేషన్ కూడా రిలీజ్ చేసింది. ఈ పార్లమెంట్ స్థానం పరిధిలో జనగాం, ఆలేరు, తుంగతుర్తి, భువనగిరి, నకిరేకల్, మునుగోడు, ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గాల్లోని అన్ని మండలాలను కవర్ చేయనున్నారు. ఒక రోజు మూడు మండలాల్లో ప్రచారం చేపట్టనున్నారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు కార్యక్రమాలు ఉండేలా ప్లాన్ చేశారు. ఆయా ప్రచార కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. 19న అర్వపల్లి, శాలిగౌరారాం, నకిరేకల్, 20న భూదాన్ పోచంపల్లి, ఆత్మకూరు (ఎం), వలిగొండ, 21న బొమ్మలరామారం, గుండాల, మోత్కూరులో ప్రచారం చేపట్టనున్నారు. 22న భువనగిరిలో క్యామ మల్లేశ్ నామినేషన్ దాఖలు చేస్తారు. 23న మద్దూరు, దూల్మిట్ట, జనగామ పట్టణం, 24న నాంపల్లి, మునుగోడు, చిట్యాల, 25న నూతనకల్, తుంగతుర్తి, నార్కట్‌పల్లి, 26న నారాయణపురం, గట్టుప్పల్, అబ్దుల్లాపూర్‌మెట్, 27న తుర్కపల్లి, బచ్చన్నపేట, ఆలేరు టౌన్, 28న రాజాపేట, మోటకొండూరు, అడ్డగూడూరు, 29న కట్టంగూర్, బీబీనగర్, యాదగిరిగుట్ట, 30న మద్దిరాల, తుర్కయంజాల్, మే 2న రామన్నపేట, చౌటుప్పల్, 3న మంచాల, ఇబ్రహీంపట్నం, 4న తిరుమలగిరి, నర్మెట్ట, తరిగొప్పుల, 5న కొమురవెల్లి, చేర్యాల, భువనగిరి పట్టణం, 6న యాచారం, మర్రిగూడ, చండూరు మండలాల్లో ర్యాలీలు, రోడ్‌షోలు నిర్వహించనున్నారు.

### క్యామ మల్లేశ్‌కు బీఆర్‌ఎస్ బీ ఫామ్..

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ గురువారం పార్టీ ముఖ్యులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రచారం, వ్యూహాలకు సంబంధించి సమగ్ర చర్చ చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్.. బీఆర్‌ఎస్ భువనగిరి అభ్యర్థి క్యామ మల్లేశ్‌కు బీ ఫామ్ అందించారు. లోక్‌సభ ఎన్నికల ఖర్చుల నిమిత్తం నియమావళి అనుసరించి అభ్యర్థికి రూ.95లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, గోట్ అడ్ షీప్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### సన్నాహక సమావేశాల సక్సెస్‌తో ఫుల్ జోష్..

కాంగ్రెస్, బీజేపీ కంటే బీఆర్‌ఎస్ పార్టీ ప్రచారంలో ముందంజలో ఉంది. అందరి కంటే ముందే నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలను నిర్వహించింది. దీనికి మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితోపాటు అభ్యర్థి క్యామ మల్లేశ్ హాజరయ్యారు. సమావేశాలకు సుమారు 3వేల నుంచి 4వేల మంది వరకు హాజరయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, అధికారంలోకి వచ్చిన తర్వాత మోసాలను కేడర్‌కు వివరించే ప్రయత్నం చేశారు. సన్నాహక సమావేశాలతో గులాబీ శ్రేణుల్లో ఫుల్ జోష్ నెలకొంది. ఒక్కసారిగా గ్రామాల్లో సీన్ మారడంతో నూతనోత్తేజం వచ్చింది. ఎట్టి పరిస్థితుల్లోనూ బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించుకుంటామని శపథం చేస్తున్నారు.

## తాగునీటికి కొరత లేకుండా చూసుకోవాలి

- పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా

అడవిదేవులపల్లి, ఏప్రిల్ 18 : మండలంలోని చిట్యాల గ్రామంలో నిర్మించిన ఇన్‌టెక్‌వెల్‌ను రాష్ట్ర పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా అడిషనల్ కలెక్టర్ పూర్ణచందర్‌రావుతో కలిసి పరిశీలించారు. కృష్ణానదిపై నిర్మించిన టెయిల్‌పాండ్ బ్యాక్‌వాటర్ నుంచి ఈ నెల 15న 4 టీఎంసీల నీటిని దిగువన ఆంధ్రాకు వదిలారు. టెయిల్‌పాండ్ బ్యాక్‌వాటర్ సామర్థ్యం 7 టీఎంసీలు ఉండగా.. 4 టీఎంసీల నీటిని దిగువకు వదలగా, మిగిలిన నీరు మిషన్ భగీరథ సప్లయ్‌కి సరిపోతాయా లేదా అని పరిశీలన చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నా రు. 3 టీఎంసీల నీరు సరిపోనట్లయితే ఎగువన సాగర్ నుంచి నీటిని వదిలేందుకు ప్రభుత్వంతో మాట్లాడుతామని తెలిపారు. ఆయన వెంట మిషన్ భగీరథ ఈఎన్‌సీ కృష్ణారెడ్డి, చీఫ్ ఇంజినీర్ చెన్నారెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వంశీకృష్ణ, డీఈ సంపత్, ఏఈలు అన్వర్, జయంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎంపీడీఓ కరుణాకర్ రావు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



ఈవీఎంల తరలింపును పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డే

## అసెంబ్లీ కేంద్రాలకు ఈవీఎంల తరలింపు

- పరిశీలించిన కలెక్టర్ వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట, ఏప్రిల్ 18 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మొదటి ర్యాండమైజేషన్ పూర్తి చేసిన అనంతరం ఈవీఎంలను అసెంబ్లీ కేంద్రాలకు తరలించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎంల గోదాములో ఈవీఎంల తరలింపు ప్రక్రియను ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్లు ప్రియాంక, బీఎస్ లతతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలకు ఈవీఎంలను తరలించినట్లు తెలిపారు. వాటిలో బ్యాలెట్ యూనిట్లు 1,500, కంట్రోల్ యూనిట్లు 1,500, వీవీ ప్యాట్లు 1,680 పంపించినట్లు చెప్పారు. ఇందులో వీవీ ప్యాట్లు 40 శాతం అదనంగా పంపించామన్నారు. అసెంబ్లీ ఏఆర్‌ఓల ఆధ్వర్యంలో బందోబస్తు నడుమ వీటిని తరలించినట్లు చెప్పారు. అసెంబ్లీ కేంద్రాల్లోని స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపరిచి రెండో ర్యాండమైజేషన్ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓలు వేణుమాధవ్, సూర్యనారాయణ, శ్రీనివాస్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు శ్రీనివాసరాజు, తాసీల్దార్లు పాల్గొన్నారు.

# చేనేత సంఘాలకు ఎన్నికలెప్పుడో?

- పాలకవర్గాలు లేక కుంటు పడుతున్న అభివృద్ధి
- పర్సన్ ఇన్‌చార్జిలతో పేరుకు పోతున్న వస్త్ర నిల్వలు
- పోచంపల్లి చేనేత సహకార సంఘంలో రెండు కోట్ల స్టాక్

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 18 : చేనేత సహకార సంఘాల పాలకవర్గాల గడువు ముగిసి ఏండ్లు గడుస్తున్నా ఎన్నికలు నిర్వహించకపోవడంతో సంఘాల అభివృద్ధి కుంటుపడుతున్నది. పర్సన్ ఇన్‌చార్జి అధికారులను నియమించడంతో చేనేత కార్మికులకు చేతినిండా పని కల్పించలేకపోతున్నారు. జిల్లాలో 2013లో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు జరుగగా.. 2018 ఫిబ్రవరిలో పాలక వర్గాల పదవీకాలం ముగిసింది. ప్రతి ఐదేండ్లకోసారి ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా.. 2018లో కొత్త పాలకర్గాలను ఎన్నుకోకుండా పర్సన్ ఇన్‌చార్జిలను నియమించారు. అప్పటి నుంచి అధికారుల పాలన కొనసాగుతుండటంతో సంఘాల్లో కార్మికులకు పని కల్పించడం లేదు.



పోచంపల్లి చేనేత సహకార సంఘంలో నిల్వ ఉన్న వస్త్రాలు

పోచంపల్లి చేనేత సహకార సంఘంలో 920 మంది చేనేత కార్మికులు సభ్యత్వం కలిగి ఉన్నారు. వారిలో 450 మంది కార్మికులు క్రియాశీలకంగా చేనేత మగ్గాలు నేసేవారు. వారికి చేతినిండా పని కల్పించకపోవడంతో క్రమంగా సభ్యుల సంఖ్య 150కి తగ్గింది. కార్మికులకు నూలు, రంగులు, రసాయనాలు, ముడి సరుకులు సకాలంలో అందించలేకపోతున్నారు. చేనేత కార్మికులు మాస్టర్ వీవర్స్ వద్ద కూలికి మగ్గాలు నేస్తున్నారు. గతంలో పాలకవర్గం ఉన్నప్పుడు పోచంపల్లి చేనేత సహకార సంఘానికి ఏడాదికి మూడు కోట్ల టర్నోవర్ అయ్యేది. అది నేడు రూ.1.70 కోట్ల నుంచి రెండు కోట్లకు పడిపోయింది. ప్రస్తుతం నెలకు 10 నుంచి 15 లక్షల రూపాయల వరకు అమ్మకాలు పడిపోయాయి. పోచంపల్లి, కొయ్యలగూడెం, చౌటుప్పల్, భువనగిరి తదితర సంఘాలకు ఏడాదికి రెండు కోట్లకు పైగా వస్త్రాలు తయారు చేయించే సామర్థ్యం ఉంది. అయితే.. వాటి నుంచి టెస్కో 50 లక్షల వస్త్రాలు కూడా కొనడం లేదు. పోచంపల్లి చేనేత సహకార సంఘానికి రూ.20 లక్షల బకాయిలు రావలసి ఉన్నది. మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో పోచంపల్లి చేనేత సహకార సంఘంలో సుమారు రూ.2కోట్ల విలువైన వస్త్ర నిల్వలు పేరుకుపోయాయి. దాంతో చేనేత కార్మికులకు పని కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 2018లో చేనేత సంఘాల పాలకవర్గం గడువు ముగిసిన వెంటనే ఎన్నికలు జరుగుతాయని గత పాలకవర్గం, అధికారులు భావించారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి ఉత్తర్వులు రాకపోవడంతో పర్సన్ ఇన్‌చార్జిలు కొనసాగుతున్నారు.

### ఉమ్మడి జిల్లాలో 84 సంఘాలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చేనేత సహకార, పవర్‌లూమ్‌లు కలిపి మొత్తం 84 సంఘాలు ఉన్నాయి. యాదాద్రి జిల్లాలో అత్యధికంగా 43 సంఘాలు ఉండగా.. 12 మాత్రమే క్రియాశీలకంగా పని చేస్తున్నాయి. వీటిలో మొత్తం 18,882 మంది చేనేత కార్మికులు సభ్యులుగా ఉన్నారు. నల్లగొండ జిల్లాలో 25 సహకార, 5 పవర్‌లూమ్ సంఘాలు ఉండగా.. వాటిల్లో మొత్తం 6,588 కార్మికులు సభ్యులుగా ఉన్నారు. సూర్యాపేట జిల్లాలో 3 సంఘాలు మాత్రమే పనిచేస్తుండగా.. వాటిల్లో 330 మంది సభ్యులు ఉన్నారు. యాదాద్రి జిల్లాలోని చేనేత సహకార సంఘాల పాలక బాధ్యతలను ఇన్‌చార్జిలకు అప్పగించారు. భూదాన్ పోచంపల్లి, సిరిపురం, తుమ్మలగూడెం, బోగారం, వెల్వర్తి సహకార సంఘాల్లో నిధుల దుర్వినియోగం, అక్రమాలు జరిగాయనే ఆరోపణతో చేనేత జౌళి శాఖ అధికారులను పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించింది. వారు విధి నిర్వహణతోపాటు సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపడుతున్నారు.

### చేనేత సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి



చేనేత సంఘాలకు పాలకవర్గం ఉంటే కార్మికుల సాధక బాధకాలను తెలుసుకొని మా అవసరాన్ని గుర్తించి సమకూరుస్తారు. కార్మికులకు పని కల్పించి సకాలంలో డబ్బులు చెల్లించాలి. చేనేత సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో కార్మికులం ఇబ్బంది పడుతున్నాం. మా సమస్యలు అధికారులకు తెలువదు. చెప్పినా పట్టించుకోరు.

– రుద్ర వెంకటేశం, చేనేత కార్మికుడు, భూదాన్ పోచంపల్లి



ఎండకు తాళలేక నల్లగొండలోని స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతున్న చిన్నారులు

# మాడ్గులపల్లిలో 45.2 డిగ్రీలు

- రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రత నమోదు
- సూర్యాపేట జిల్లా పెదవీడులో 44.7 డిగ్రీలు..
- అర్ధరాత్రికి కూడా చల్లబడని వాతావరణం
- అత్యవసరమైతే తప్ప బయటకు రాని జనం


సూర్యాపేట, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ) : సూర్యుడు రోజురోజుకూ మండిపోతున్నాడు. ఉదయం నుంచి రాత్రి పన్నెండు గంటల వరకు కూడా వేడిమి తగ్గడం లేదు. మరీ రెండ్రోజులుగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సూర్యుడు నిప్పులు కక్కుతుండగా మే నెలలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గురువారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎక్కడా 40డిగ్రీలకు తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కాలేదు. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లిలో రాష్ట్రంలోనే అత్యధికంగా 45.2 డిగ్రీల సెల్సియస్ నమోదు కాగా, సూర్యాపేట జిల్లాలో అత్యధికంగా మఠంపల్లి మండలంలోని పెదవీడులో 44.7 డిగ్రీలు నమోదైంది. ఇక యాదాద్రి భువనగిరి జిల్లాలో అత్యధికంగా మోత్కూరులో 43.4డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే నల్లగొండ జిల్లా కట్టంగూరులో 44.7, అనుముల మండలం ఇబ్రహీంపేటలో 44.6, నాంపల్లిలో 44.5, వేములపల్లి మండలం బుగ్గబాయిగూడెంలో 44.5, మిర్యాలగూడలో 44.4 డిగ్రీలు నమోదు కాగా, ఈ జిల్లాలో శాలిగౌరారంలో అత్యల్పంగా 41.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సూర్యాపేట జిల్లా పరిధిలో సూర్యాపేట మండలం టేకుమట్లలో 44.5 డిగ్రీలు నమోదు కాగా, మామిళ్లగూడెం, పెన్‌పహాడ్, తొగర్రాయిలో 44.5 డిగ్రీలు నమోదైంది. ఈ జిల్లాలో అత్యల్పంగా తుంగతుర్తిలో 40.3 డిగ్రీలు నమోదైంది. యాదాద్రి జిల్లా పరిధిలో గుండాలలో 43.1, వలిగొండలో 42.9, చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురంలో 42.8, యాదగిరిగుట్ట, ఆలేరులో 42.7, ఆత్మకూరు(ఎం)లో 42.5, బొమ్మలరామారంలో 42.3, రాజాపేటలో 42.1, రామన్నపేటలో 42, భువనగిరి, బీబీనగర్‌లో 41.7, అడ్డగూడూరులో 41.6, భూదాన్ పోచంపల్లిలో 41.1, మోటకొండూరులో 40.9, వలిగొండలో 40.5 డిగ్రీలు నమోదు కాగా, ఈ జిల్లాలో అత్యల్పంగా తుర్కపల్లి(ఎం)లో 39.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 40 నుంచి 45.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో అర్ధరాత్రి అయినా వేడిమి తగ్గడంలేదు. మధ్యాహ్నం ఉక్కపోతకు జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండ వేడిమితో జనం ఇండ్లకే పరిమితమవుతుండడంతో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల మోత మోగుతుంది. ప్రజలు ఏ పని ఉన్నా ఉదయం, సాయంత్రం చేసుకుంటున్నారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం సమయంలో జనం బయటకు రావడం లేదు.



బీఆర్‌ఎస్ నేత జనార్దన్ రావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తదితరులు

## జనార్దన్‌రావుకు ప్రముఖుల నివాళి

- తరలివచ్చిన వివిధ పార్టీల నేతలు, కార్యకర్తలు, ప్రజలు
- సందినేని మరణం బీఆర్‌ఎస్‌కు తీరని లోటు
- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి



జనార్దన్‌రావు కుమారుడిని ఓదారుస్తున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

నల్లగొండ, ఏప్రిల్ 18 : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బీఆర్‌ఎస్ నల్లగొండ పట్టణ ప్రధాన కార్యదర్శి సందినేని జనార్దన్‌రావుకు ప్రముఖులు నివాళులర్పించారు. ఆయన భౌతిక కాయంపై పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి పట్టణంలోని అమూల్యకాలనీలో జనార్దన్‌రావు ఇంటికి వెళ్లి ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మాట్లాడతుఊ.. పార్టీ పట్ల నిబద్ధత కలిగిన జనార్దన్‌రావును కోల్పోవడం బీఆర్‌ఎస్ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. నిత్యం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ వారి మన్ననలు పొందినట్లు గుర్తుచేశారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందన్నారు. తనకు అన్నివేళలా అత్యంత ఆప్తుడిగా ఉన్న జనార్దన్‌రావు మృతదేహానికి నివాళి అర్పిస్తూ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి కంట తడి పెట్టారు. ప్రమాదానికి కొన్ని గంటల ముందు జనార్దన్‌రావు తనతో ఉన్నాడని, ఇప్పుడు ఇలా విగత జీవిగా మారడం తనను కలిచివేసిందని పేర్కొన్నారు. జనార్దన్‌రావు అంత్యక్రియలు గురువారం మధ్యాహ్నం హైదరాబాద్ రోడ్డులోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని శ్మశాన వాటికలో నిర్వహించారు. అంతిమ యాత్రలో కాలనీవాసులతోపాటు వివిధ పార్టీల నేతలు, బీఆర్‌ఎస్ శ్రేణులు, పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంతిమయాత్రలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి జనార్దన్‌రావు పాడె మోశారు. నివాళి అర్పించిన వారిలో బీఆర్‌ఎస్ నేతలు రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, గోన విష్ణువర్ధన్‌రావు, కటికం సత్తయ్యగౌడ్, కరీం పాషా, మాలె శరణ్యారెడ్డి, చిట్ల వెంకటేశం, అభిమన్యు శ్రీనివాస్, చీర పంకజ్‌యాదవ్, కొండూరు సత్యనారాయణ, బోనగిరి దేవేందర్, బకరం వెంకన్న, నాగరత్నం రాజు, సహదేవ్‌రెడ్డి, దేప వెంకట్‌రెడ్డి, బీజేపీ నేతలు మాదగోని శ్రీనివాస్‌గౌడ్, బండారు ప్రసాద్, పలువురు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థినుల అస్వస్థత

నేరేడుచర్ల, ఏప్రిల్ 18 : మండలంలోని చిల్లేపల్లి పరిధిలో గల బీసీ బాలికల గురుకుల పాఠశాలలో నలుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న సంజన, లావణ్య, వసంత రాణి, ప్రణీతకు గురువారం తెల్లవారుజాము నుంచి వాంతులు ప్రారంభమయ్యాయి. దాంతో క్రాఫ్ట్ టీచర్ భరణి ప్రాథమిక చికిత్స చేసి నేరేడుచర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. చికిత్స అనంతరం విద్యార్థినుల ఆరోగ్యం కుదుట పడడంతో ఇద్దరు విద్యార్థినులను తల్లిదండ్రులు వచ్చి తీసుకువెళ్లగా మరో ఇద్దరిని హుజూర్‌నగర్‌లోని వారి తల్లిదండ్రులకు అప్పజెప్పేందుకు టీచర్ ఆటోలో తీసుకెవెళ్లింది. అస్వస్థతకు కారణాలపై విచారించగా నలుగురు విద్యార్థినులు మాత్రమే వాంతులు చేసుకున్నారని, మిగిలిన వారికి ఎటువంటి ఇబ్బందులు లేవని టీచర్ తెలిపింది.